క్లుప్తంగా

మంత్రి కాకాణికి వినతి

పొదలకూరు : ఎస్సీలకు చెందిన వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఆయన క్యాంపు కార్యాలయంలో బీజేపీ ఎస్సీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు, సర్వేపల్లి ఇన్‌చార్జి ఎం రవీంద్రబాబు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఎస్సీ కార్పొరేషన్‌లో తొలగించిన 26 రకాల పథకాలను తిరిగి పునరుద్ధరించాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని భక్తవత్సలనగర్‌లోని పింఛనర్ల సంక్షేమ భవనంలో ఆదివారం ఉదయం పదికి నిర్వహించనున్నామని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌస్, ఎస్వీవీఎన్ మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ అంశాలపై చర్చించనున్నామని, కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికులకు వస్త్రాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దేవరకొండ సుజాత మాట్లాడారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సహకారంతో వీటిని అందజేశామని చెప్పారు. శానిటేషన్ సెక్రటరీ లీలావతి, మేస్త్రీ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

డీఏఓకు అభినందనలు



నెల్లూరు(సెంట్రల్): జిల్లా వ్యవసాయాధికారిగా బాధ్యతలు చేపట్టిన సత్యవాణిని పలువురు వ్యవసాయాధికారులు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు అభినందనలను తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయాధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు హరికరుణాకర్‌రెడ్డి, కార్యదర్శి నాగమోహన్, కోశాధికారి జహీర్, భూసార పరీక్ష కేంద్ర ఏడీ కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి గానూ గ్రీవెన్స్ డేను ప్రతి నెలా మూడో శుక్రవారం నిర్వహిస్తున్నామని, దీని ద్వారా త్వరితగతిన పరిష్కార మార్గాన్ని చూపాలని ఇన్‌చార్జి కమిషనర్ చెన్నుడు ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో పలువురు ఉద్యోగుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.

స్వయం ప్రకటిత పదవులు సరికాదు



నెల్లూరు(బృందావనం): ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అనుబంధ సంస్థ అయిన నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడినంటూ ఒకరు స్వయం ప్రకటన చేసుకోవడం సిగ్గుచేటని సంఘ అధ్యక్షుడు పేర్ల సీతారామారావు పేర్కొన్నారు. లక్ష్మీపురంలోని ఆర్యవైశ్య భవన్‌లో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ ఆధ్వర్యంలో కార్యకలాపాలను మహాసభ సాగిస్తోందని చెప్పారు. నిబంధనలు, బైలా నియమావళి మేరకు మహాసభ సాగుతోందని తెలిపారు. అధ్యక్షుడినని చెప్పుకోవడం తప్ప జిల్లాలోని ఆర్యవైశ్యులకు వారు చేసిందేమీ లేదని విమర్శించారు. జనవరిలో నిర్వహించనున్న అర్బన్ ఆర్యవైశ్య సంఘ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్‌ను జారీ చేశారని, దీని మేరకు అధ్యక్షుడి నియామకం జరగనుందని తెలిపారు. నాలుగు గోడల మధ్య ఎన్ని పదవులిచ్చుకున్నా బైలా నియమావళి మేరకు చెల్లుబాటు కాదనే విషయాన్ని తెలుసుకోవాలని హితవు పలికారు. బైసాని జ్యోతిప్రసాద్, కామేశ్వరరావు, చలువాది వెంకటేశ్వర్లు, మెంటా నరసింహారావు, తాతా కిషోర్, శ్రీకాంత్, కర్నాటి నిరంజన్, అప్పల సత్యం, పాదర్తి బాలాజీ, సత్యకృష్ణ, చందు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



మనుబోలులోని పెద్దచెరువు గట్టుపైనున్న నాగుల పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు

పొదలకూరు: నాగుల చవితి పర్వదినాన్ని మండల ప్రజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని నాగుల పుట్టల వద్ద నోములు నోచుకున్న మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పొదలకూరు శివాలయంలోని నాగ శిలల వద్ద విశేష పూజలు జరిపారు. నిమ్మమార్కెట్ యార్డు సమీపంలోని నాగుల పుట్ట వద్ద మహిళా భక్తుల కోలాహలం కనిపించింది,

మనుబోలు: నాగుల చవితిని పర్వదినాన్ని మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. గ్రామాల్లోని నాగుల పుట్టల వద్ద నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. మనుబోలులోని గ్రామదేవత మనుబోలమ్మ ఆలయానికి వెనుకవైపున పెద్దచెరువు గట్టున ఉన్న నాగుల పుట్ట వద్ద మహిళలు పూజలు చేశారు. ఉదయాన్నే తలస్నానం చేసి నాగుల పుట్ట వద్దకు చేరుకున్న మహిళలు పుట్టలో పాలు పోసి కోడి గుడ్లు, మొలకెత్తిన సజ్జలు, చలిపిండి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మ, గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు సాయిశర్మ, సుబ్రహ్మణ్యశర్మ శాస్త్రోక్తంగా గ్రామదేవతలకు పూజలు నిర్వహించిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వెంకయ్యస్వామి ఆలయం వద్ద ఉన్న నాగులపుట్ట వద్ద మహిళలు పెద్దఎత్తున పూజలు చేశారు. అర్చకులు శ్రీనివాసులు శాస్త్రోక్తంగా నాగదేవతకు పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కోవూరు : మండల ప్రజలు నాగుల చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. చిన్నపడుగుపాడు ప్రాంతంలోని నాగులపుట్ట వద్ద మహిళలు విశేష పూజలు చేశారు. రామిరెడ్డి దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పడుగుపాడు సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దయాకర్‌రెడ్డి గత కొన్నేళ్లుగా నిర్విరామంగా అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తుండడం అభినందనీయమని పేర్కొన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎస్ నరసింహులురెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రాజగోపాల్, మాజీ ఎంపీటీసీ సభ్యులు సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: నాగులచవితి పర్వదినాన్ని మండల వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మహిళలు ఉదయాన్నే తలంటు స్నానాలు ఆచరించి గ్రామాల్లోని నాగులపుట్టల వద్దకు వెళ్లి పాలుపోసి చుట్టూ దారాలు చుట్టారు. అనంతరం నాగదేవతకు పూజలు చేసి సజ్జలు, సలిపిండిని నైవేద్యంగా సమర్పించారు. దీంతో గ్రామాల్లోని నాగుల పుట్టల వద్ద కోలాహలం నెలకొంది.



పొదలకూరు: శివాలయంలోని నాగ శిలల వద్ద పూజలు చేస్తున్న మహిళలు



ఇందుకూరుపేట మండలం కొమరికలో..



కోవూరులో అన్నప్రసాద వితరణ

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

కోవూరు : కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ దయాకర్ ఏఈలను ఆదేశించారు. శుక్రవారం ఆయన కోవూరులోని తన కార్యాలయంలో గృహ నిర్మాణాలపై మండల హౌసింగ్ ఏఈలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి గృహాలు నిర్మించేలా చూడాలన్నారు. గృహ నిర్మాణాలకు ప్రభుత్వం అందిస్తున్న సహకారంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.నిర్దేశించిన లక్ష్యాల సాధనపై వర్క్ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం మండలాల వారీగా గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. ఈ సమీక్షలో గృహ నిర్మాణ శాఖ ఏఈలు మాధవయ్య, వెంకటేశ్వర్లురెడ్డి, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ డీఈ దయాకర్

నేడు మంత్రి కాకాణి పర్యటన

పొదలకూరు : మండలంలోని వరదాపురంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు గ్రామానికి చేరుకుని గిరిజన కాలనీలో నూతనంగా నిర్మించిన వినాయకస్వామి ఆలయంలో జరిగే విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొంటారని స్థానిక వైఎస్సార్‌సీ నాయకుడు డీ శ్రీనివాసులురెడ్డి శుక్రవారం తెలిపారు. మంత్రి కాకాణి చొరవతో టీటీడీ సహకారంతో దేవస్థానాన్ని నిర్మించినట్లు చెప్పారు. చట్టుపక్కల గ్రామాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు రక్తపరీక్షలు



పొదలకూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు శుక్రవారం రక్తపరీక్షలు చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంలో భాగంగా ప్రభుత్వాస్పత్రి సిబ్బంది హిమోగ్లోబిన్ , బ్లడ్ గ్రూపు పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కావ్యశ్రీ, ప్రిన్స్‌పల్ విష్ణువర్ధన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్డీ నాహిద్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్కంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల పేరు మార్పు

మనుబోలు: మండలంలోని అక్కంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు దాత నారపరెడ్డి సీతారామిరెడ్డి పేరును ఖరారు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అక్కంపేట ప్రాథమికోన్నత పాఠశాలను మాజీ సర్పంచ్ ఎన్ కిరణ్‌కుమార్‌రెడ్డి తన సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మూతపడే దశలో ఉన్న పాఠశాలను కోర్టులను ఆశ్రయించి నిలిబెట్టారు. అంతటితో ఆగకుండా పాఠశాలలో కార్పొరేట్ తరహాలో వసతులను కల్పించి విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచారు. దాన్ని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో జెడ్పీ ఉన్నత పాఠశాలగా మార్పు చేయించారు. ఆపై తన తండ్రి పేరును పాఠశాలకు పెట్టాలని ప్రభుత్వానికి విన్నవించారు. ఎట్టకేలకు ప్రభుత్వ ఆదేశాలతో పాఠశాల విద్యా శాఖ కిరణ్‌కుమార్‌రెడ్డి తండ్రి నారపరెడ్డి సీతారామిరెడ్డి(ఎన్ఎస్ఆర్) పేరును అక్కంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు పెడుతూ ఉత్తర్వులు జారీ చేసింది.



GOVERNMENT OF ANDHRA PRADESH

SCHOOL EDUCATION DEPARTMENT

Sub: School Education – Name Change – C.C. No. 2067of 2022 in WP No. 8112 of 2022 filed by Sri. N. Kiran Kumar Reddy- Permission for naming the ZPH School, Akkampeta, Manubol Mandal, SPSR Nellore District after "Narapa Reddy Seetharami Reddy (NSR), Zilla Parishad High School"- Accorded – Orders – Issued – Communicated - Reg.

(Copy communication)

While communicating a copy of the Govt. Memo to the reference read above, the Regional Joint Director of School Education, Guntur & District Educational Officer, SPSR Nellore are requested to take immediate necessary action, as directed by the Government in the Memo and submit a compliance to this office without fail.

Encl: As above

Director Co-Ordination

To

The Regional Joint Director of School Education, Guntur

The District Educational Officer, SPSR Nellore

Copy to

Government Pleader for School Education Department, Hon'ble High Court of Andhra Pradesh.

విద్యాశాఖ జారీచేసిన ఉత్తర్వులు

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి సిబ్బందికి సూచించారు. నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో సిబ్బంది శుక్రవారం నిర్వహించిన కవాతును వీక్షించి గౌరవవందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్య విషయంలో ఏ మాత్రం అశ్రద్ధ వహించకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. 40 ఏళ్లు పైబడిన సిబ్బంది హెల్త్ చెకప్‌ను తరచూ చేయించుకోవాలని కోరారు. పోలీస్ సిబ్బంది, వారి కుటుంబసభ్యుల సంక్షేమంలో భాగంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో యోగా తరగతులను త్వరలో నిర్వహించనున్నామని వెల్లడించారు. అనంతరం పోలీస్ సంక్షేమ దివస్‌ను నిర్వహించారు. పలువురు సిబ్బంది తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీకి అందజేశారు. వీటిని వెంటనే పరిష్కరించాలని ఆయన సూచించారు. ఏఎస్పీలు హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, నెల్లూరు నగర, రూరల్, ట్రాఫిక్, ఏఆర్, హోంగార్డ్స్ డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, వీరాంజనేయరెడ్డి, అబ్దుల్ సుభాన్, గాంధీ, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



సిబ్బంది సమస్యలను తెలుసుకుంటున్న తిరుమలేశ్వరరెడ్డి

వ్యాయామాన్ని తప్పక చేయాలి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఆరోగ్యంగా ఉండేందుకు గానూ వ్యాయామాన్ని ప్రతి ఒక్కరూ తప్పక చేయాలని న్యూరాలజిస్ట్ యామిని పేర్కొన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వాకర్స్‌కు అవగాహన సదస్సును వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకట్ల రఘురామ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా న్యూరాలజిస్ట్ యామిని, స్కిన్ స్పెషలిస్ట్ హర్షవర్ధన్ హాజరయ్యారు. పక్షవాతానికి దూరంగా ఉండేందుకు గానూ వ్యాయామం తప్పనిసరని చెప్పారు. కార్యదర్శి దాసరి అనంతరామారావు, గౌరవాధ్యక్షుడు కిలారి తిరుపతినాయుడు, వేలూరు రంగారావు, దద్దోలు రమణయ్యగౌడ్, రాఘవేంద్రశెట్టి, బాసం శేషగిరిరావు, అరిగెల సాయిరామ్, బాలసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హర్షవర్ధన్

సాగునీటి విడుదలపై ఆందోళన చెందొద్దు

మనుబోలు: మండలంలోని కండలేరు ఆయకట్టు రైతులెవరూ సాగునీటిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కండలేరు నుంచి సాగునీరు విడుదల చేస్తామని ఇరిగేషన్ ఈఈ అనిల్‌కుమార్ తెలిపారు. మనుబోలు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఆయన రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో సాగునీటి విడుదలపై అన్నదాతల్లో ఆందోళన నెలకొందన్నారు. రైతులు భయపడాల్సిన పనిలేదన్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 22లోపు కండలేరు నుంచి సాగునీటిని విడుదల చేస్తామని తెలిపారు. విడతల వారీగా 2 టీఎంసీలను అందజేస్తామని, రైతులు సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. సాగునీటి వృథాను అరికట్టేందుకు రైతులతో ఓ కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ భాస్కర్‌రెడ్డి, ఏఈలు వేమారెడ్డి, ఠాగూర్, వ్యవసాయశాఖ డీఈ శివనాయక్, ఏఈ జహీర్, ఏఓ కళారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇరిగేషన్ అధికారి

కృష్ణపట్నం పోర్టులో ఆక్టోపస్ మాక్‌డ్రిల్

ముత్తుకూరు: ఆదాని కృష్ణపట్నం పోర్టులోకి సముద్ర మార్గం ద్వారా కొందరు ఉగ్రవాదులు గురువారం రాత్రి చొరబడ్డారు. పోర్టు అధికారుల సమాచారంతో రంగంలోకి దిగిన సుమారు 30 మంది ఆక్టోపస్ దళ సభ్యులు గ్రూపులుగా విడిపోయి పోర్టుపై ఉగ్రవాదుల దాడిని తిప్పికొట్టారు. శుక్రవారం వేకువజాము వరకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగించి ఉగ్రవాదులను బంధీలుగా పట్టుకున్నారు. ఇదంతా నిజం అనుకుంటే పొరపాటు. విపత్కర పరిస్థితుల్లో రక్షణ వ్యవస్థను అప్రమత్తం చేయడానికి ఆక్టోపస్ చేపట్టిన మాక్‌డ్రిల్. కాగా ఈ మాక్‌డ్రిల్‌ను నేలటూరులోని ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు.



మాక్‌డ్రిల్‌లో ఆక్టోపస్ దళాలు

యాజమాన్య పద్ధతులు పాటించాలి

తోటపల్లిగూడూరు: వరి సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ మారుతీదేవి సూచించారు. మండలంలోని వెంకన్నపాళెం, పోట్లపూడి, ఇస్కపాళెం సచివాలయాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మారుతీదేవి మాట్లాడుతూ రబీ సీజన్‌లో సరైన యాజమాన్య పద్ధతులతో సాగుచేపడితే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందన్నారు. మేలైన విత్తనాలను ఎంచుకుని నారుమళ్లను సిద్ధం చేసుకోవాలన్నారు. రసాయన ఎరువుల మోతాదును తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. నీటి యాజమాన్యం, నారుమళ్ల నుంచి పంట కోత వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓలు శైలజ, మధురిమ, స్థానిక వీఏఏలు రూన్సి, షరిమ్మల తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

రామలింగేశ్వరుడి సేవలో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

విడవలూరు: మండలంలోని రామతీర్థంలో కొలువైన కామాక్షితాయి సమేత రామలింగేశ్వరస్వామిని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో ఎస్పీకు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్రను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఆలయ చైర్మన్ చంద్రయ్య, అర్చకులు, పాలక మండల సభ్యులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో కార్తీక మాస పూజలు

కోవూరు: స్థానిక గాంధీ పార్కు సెంటర్‌లోని పార్వతి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో కార్తీక మాస శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో దేవదేవేరులకు విశేషాభిషేకాలు, పూజలు జరిపారు. మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించి నోములు నోచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బీ సురేష్, ధర్మకర్తలు పీ మోహన్, ఏ హనుమారెడ్డి, భక్తులు పాల్గొన్నారు..



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళా భక్తులు

గ్రంథాలయాలు విజ్ఞాన నేస్తాలు

మనుబోలు: గ్రంథాలయాలు విజ్ఞాన నేస్తాలని, వాటిని సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అహ్మద్ పిలుపునిచ్చారు. మనుబోలు బస్టాండ్ సెంటర్‌లోని గ్రంథాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. యువత, విద్యార్థులకు అవసరమైన పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్, సాహిత్యం, చరిత్ర, సైన్స్ పుస్తకాలతో పాటు దిన, వార పత్రికలు అందుబాటులో ఉంచామని చెప్పారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ అరుణ్‌కుమార్ గ్రంథాలయంలోని సమస్యలను డీడీ దృష్టికి తీసుకెళ్లారు. వర్షాకాలంలో భవనం ఉరుస్తుండడంతో పుస్తకాలు తడిసిపోతున్నాయని విన్నవించారు. పాఠకులు సైతం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్పందించిన డీడీ గ్రంథాలయాలకు పంచాయతీలు చెల్లించాల్సిన సెస్సు బకాయిలు భారీగా పేరుకుపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోందన్నారు.

సాహిత్యంపై అవగాహన

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయంలో తెలుగు ఉపాధ్యాయుడు మల్లికార్జున్ విద్యార్థులకు సాహిత్యంపై అవగాహన కల్పించారు. మరో ఉపాధ్యాయుడు శ్రీనివాస్ గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు.

గుర్రం జాషువా గొప్ప రచయిత

కొడవలూరు: గుర్రం జాషువా ఎంతో గొప్ప రచయిత అని ఉపాధ్యాయుడు రాజేష్ కొనియాడారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని యల్లాయపాళెం గ్రంథాలయంలో తెలుగు రచయిత గుర్రం జాషువా చిత్ర పటానికి శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి ఉపయుక్తమైన రచనలందించిన వారిలో జాషువా ఒకరని కొనియాడారు. అనంతరం 'రచయితలు–రచనలు' అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ జే సురేంద్రరెడ్డి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• కొడవలూరు గ్రంథాలయం ఆధ్వర్యంలో స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు 'రచయితలు–రచనల గొప్పతనం' అనే అంశంపై క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయిని చంద్రిక మాట్లాడుతూ తెలుగు రచయితలు, రచనల గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేసేందుకు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి పోటీలతో తెలుగు భాషపై విద్యార్థుల్లో పట్టు పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కే రాజేశ్వరి, ఉపాధ్యాయినులు షకీల, ముహ్మదా తదితరులు పాల్గొన్నారు.

కవితల పోటీలు

వెంకటాచలం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఏ రేవతి ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు కవితల పోటీలు నిర్వహించారు. అనంతరం పుస్తక సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. పౌర గ్రంథాలయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పీ అహ్మద్ గ్రంథాలయాన్ని సందర్శించి వారోత్సవాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.



కొడవలూరు: యల్లాయపాళెంలో గుర్రం జాషువాకు నివాళులర్పిస్తున్న దృశ్యం



మనుబోలు గ్రంథాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీడీ అహ్మద్



కొడవలూరు గురుకులంలో...



వెంకటాచలంలో..